ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 16.0

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

గురువారం 11 డిసెంబరు 2025

ఆయిల్‌పాంపై ఆసక్తి

- ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన సాగు
- ఒకసారి మొక్కలు నాటితే 35 ఏళ్లు రాబడి
- నాలుగేళ్లు ప్రభుత్వమే పెట్టుబడి సాయం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 7,978 ఎకరాల్లో సాగు

6

నేడే తొలిపోరు

- 58 సర్పంచు, 921 వార్డు స్థానాలు ఏకగ్రీవం
- మిగిలిన వాటిలో ఒక సర్పంచు, ఒక వార్డు స్థానానికి నామినేషన్లు నిల్
- 4,705 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు.. 12,398 మంది సిబ్బంది నియామకం
- 5,088 మంది పోలీసులతో బందోబస్తు
- ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్.. 2 గంటల నుంచి లెక్కింపు

ఉమ్మడి జిల్లాలో 492 సర్పంచ్ స్థానాలు.. 3,919 వార్డులకు మొదటి విడత పోలింగ్



ఎన్నికలు జరుగనున్న నవాబ్‌పేట మండలం కూచూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల తొలి విడత పోరుకు రంగం సిద్ధమైంది. హోరాహోరీగా సాగిన ప్రచారం మంగళవారంతో ముగిసింది. తాయిళాలు పంచడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం బుధవారం అర్ధరాత్రి వరకు ఆయా పార్టీల మద్దతుదారులు కొనసాగించారు. పార్టీల మద్దతులు ఉన్నప్పటికీ వ్యక్తుల కేంద్రంగా జరిగే ఎన్నికలు కావడంతో పంచాయతీల్లో పోలింగ్ హోరాహోరీగా సాగనుంది. గతంలో లేని విధంగా పంచాయతీ ఎన్నికల ముంగింట సీఎం ఆయా జిల్లాల్లో పర్యటించడంతో ఎమ్మెల్యేలు, మాజీల్లో కూడా కొంత ఒత్తిడి పెరిగింది. కాలికి బలపం కట్టుకున్నట్లు నియోజకవర్గాలకే పరిమితమై.. తాము మద్దతిచ్చిన అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు.

అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పోటీ

పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దాదాపు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎన్నికలు జరిగే అన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. ఒక్కో గ్రామంలో ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. బీఆర్‌ఎస్ కొన్ని స్థానాల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా పోటీకి దూరంగా ఉంది. ఈసారి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలనుకున్న బీజేపీ మాత్రం కేవలం 40 శాతం నుంచి కొన్ని జిల్లాల్లో అంత కంటే తక్కువ స్థానాల్లో పోటీలో ఉంది. మిగిలిన మెజారిటీ చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నారు. కాంగ్రెస్

(మిగతా 6లో..)

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు, ఏకగ్రీవం అయినవి, పోలింగ్ జరిగే వాటి వివరాలు

జిల్లా	జీపీలు/ ఏకగ్రీవం	వార్డులు/ ఏకగ్రీవం	పోలింగ్ జీపీలు/ వార్డులు
మహబూబ్‌నగర్	139/10	1188/ 264	128/923
గద్వాల	106/15	974/ 135	91/839
నారాయణపేట	67/14	572/ 210	53/362
వనపర్తి	87/05	780/ 104	82/676
నాగర్‌కర్నూల్	151/14	1326/ 208	137/1118

గ్రామాలకు చేరుకున్న ఓటర్లు

గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభం కానుండగా.. ఇప్పటికే ఇతర ప్రాంతాలకు చెందిన ఓటర్లు గ్రామాలకు చేరుకున్నారు. కొందరు ఉదయం నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునే అవకాశం ఉంది. పోలింగ్ జరిగే మండలాల్లో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మొదటి విడతలో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని గండీడ్, రాజాపూర్, మహమ్మదాబాద్, నవాబుపేట, మహబూబ్‌నగర్ మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో కల్వకుర్తి, వంగూరు, ఉర్కొండ, వెల్దండ, తాడూరు, తెల్కపల్లి, గద్వాల జిల్లా పరిధిలో గద్వాల, ధరూర్, కేటీదొడ్డి, గట్టు, వనపర్తి జిల్లా పరిధిలో ఖిల్లాఘణపురం, పెద్దమందడి, రేవల్లి, ఏదుల, గోపాల్‌పేట, నారాయణపేట జిల్లా పరిధిలో మద్దూరు, కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లోని పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు.



మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని బాయ్స్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంలో సామగ్రి సరి చూసుకుంటున్న సిబ్బంది



జిల్లా కేంద్రంలో సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



సామగ్రితో వెళ్తున్న ఉద్యోగి

సర్వం సిద్ధం

- తొలి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- సిబ్బందికి సామగ్రి అందజేత
- మహబూబ్‌నగర్ జిల్లాలో 128 సర్పంచ్ స్థానాలు, 923 వార్డు స్థానాలకు పోటీ
- ఓటు వేయనున్న 1,60,353 మంది ఓటర్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం నిర్వహించనున్న గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. అందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా మండల కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి గురువారం సామగ్రిని పంపిణీ చేశారు. షెడ్యూల్ ప్రకారం 139 గ్రామ పంచాయతీల్లో 139 సర్పంచ్, 1,188 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఏకగ్రీవం అయిన వాటిని మినహాయిస్తే 128 సర్పంచ్ స్థానాలు, 923 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ స్థానాలకు 433 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 2,459 మంది పోటీ పడుతున్నారు. గండీడ్, మహమ్మదాబాద్, నవాబ్‌పేట, రాజాపూర్, మహబూబ్‌నగర్ మండలాల్లో ఈ ఎన్నికలు జరుగనున్నాయి.

3,097 మంది పోలింగ్ సిబ్బంది

139 గ్రామ పంచాయతీల్లో 3,097 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. అందులో పీఓలు 1,426 మంది, ఓపీఓలు 1,671 మంది ఉన్నారు. 1,188 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



పంపిణీ కోసం సిద్ధంగా ఉంచిన సామగ్రి



సామగ్రితో బయల్దేరి వెళ్తున్న సిబ్బంది

పోలింగ్ సిబ్బందితో పాటు 20 శాతం సిబ్బందిని అదనంగా రిజర్వులో ఉంచారు.

మహిళా ఓటర్లే అధికం

ఐదు మండలాల్లో 1,60,353 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 79,994 మంది, మహిళలు 80,359 మంది, 365 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు.

మండల కేంద్రాల్లో పంపిణీ

ఆయా మండల కేంద్రాల్లో సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన సామగ్రిని జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కాలేజీలో అందజేశారు. కలెక్టర్ విజయేందిర బోయి పంపిణీని పరిశీలించారు. పీఓలు, ఓపీఓలు సామగ్రిని తీసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను, ప్రైవేట్ వాహనాల్లో గ్రామాలకు బయల్దేరారు.

సమన్వయంతో పని చేయండి

కలెక్టర్ విజయేందిర బోయి

జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి సంబంధించి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. 3,097 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. పీఓలు 1,426 మంది, ఓపీఓలు 1,671 మంది కేటాయించినట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య

హోరాహోరీ

- పలు స్థానాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య రాజీ

7

గుర్తింపు కార్డు తప్పనిసరి

- ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఉండాల్సిందే..
- ఓటరు స్లిప్‌తో పాటు వెంట తీసుకెళ్లాలి
- ఎన్నికల సంఘం సూచించిన 18 రకాల కార్డులు

7

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల వాగ్వాదం

- నసరుల్లాబాద్‌లో ప్రచారం సందర్భంగా ఘటన

7

94,556 క్వింటాళ్ల

ధాన్యం కొనుగోలు

- నారాయణపేట జిల్లాలో 117 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- రైతులకు రూ.177 కోట్లు చెల్లింపు.. రూ.177 కోట్ల పెండింగ్



'పేట' మండలం సింగారం చౌరస్తాలో ధాన్యాన్ని లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు

నారాయణపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలంలో ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 94,556 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలులో ఈసారి నిబంధనలు అధికంగా ఉండటం, రైతులకు గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడం, ధాన్యాన్ని కేంద్రాలకే తేవాలని చెబుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

బోనస్ చెల్లింపులో జాప్యం

క్వింటాలుకు మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2,389లు, సాధారణ రకానికి రూ.2,369లు ఇస్తున్నారు. సన్న రకాలకు క్వింటాలుపై రూ.500 బోనస్ చెల్లిస్తున్నారు. అయితే బోనస్ డబ్బులు చెల్లించడంలో జాప్యం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

117 కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 117 కొనుగోలు కేంద్రాల ద్వారా 14,329 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు 94,556.120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతుల ఖాతాల్లో రూ.177.76 కోట్లు జమ చేయగా, ఇంకా రూ.177.76 కోట్లు జమ చేయాల్సి ఉంది. జిల్లాలో 48 రైస్ మిల్లులు ఉండగా, 31 రైస్ మిల్లులు బ్యాంకు గ్యారంటీ ఇవ్వడంతో వాటికి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయిస్తున్నారు. ఇప్పటికే 91,410.330 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించారు. ఇంకా 3145.790 మెట్రిక్ టన్నులు తరలించాల్సి ఉంది.



బందోబస్తు పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

- పోలీసులకు ఎస్పీ జానకి దిశానిర్దేశం

మహబూబ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులంతా పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వివాదాలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీస్ బలగాలతో ఎస్పీ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలను ప్రభావితం చేసే ప్రయత్నాలను, గుంపులుగా తిరగడం, గొడవలు జరిగితే వెంటనే అరికట్టాలని చెప్పారు. పరిస్థితులను బట్టి సిబ్బంది చురుగ్గా, వేగంగా కదలాలని అన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సిబ్బంది తమ పైఅధికారి ఆదేశాలు వచ్చే వరకు విధుల్లో ఉండాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకుందని వెల్లడించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ గౌడ్, రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గర్భిణులకు అమ్మఒడి

- సేవలను అందిస్తున్న 102 అంబులెన్స్‌లు
- బాలింతలు, శిశువులకు కూడా..
- ఉమ్మడి జిల్లాలో 50 వాహనాలు
- 20 నెలల్లో 3,12,207 మందికి లబ్ధి



మద్దూర్ మండలం రెనివట్ల నుంచి పరీక్షల కోసం మద్దూర్ పీహెచ్‌సీకి 102 అంబులెన్స్‌లో వచ్చిన గర్భిణులు(ఫైల్)

నారాయణపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రసవ పరీక్షల కోసం గర్భిణులు ఆస్పత్రికి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు ఒకప్పుడు ఇబ్బందులు పడేవారు. ప్రసవం అయ్యాక ఇంటికి రావాలన్నా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉచితం అమ్మఒడి 102 అంబులెన్స్‌లను తెచ్చింది. అవి గర్భిణులకు, బాలింతలకు, పుట్టిన పిల్లలకు సేవలను అందిస్తున్నాయి.

50 అంబులెన్స్‌లు

ఉమ్మడి జిల్లాలో 50.. అంబులెన్స్‌లు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 10, నాగర్‌కర్నూల్‌లో 14, వనపర్తిలో 8, నారాయణపేట లో 8, జోగులాంబ గద్వాల జిల్లాలో 10 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి.

20 నెలల్లో..

గర్భధారణ నుంచి డెలివరీ పూర్తయ్యే వరకు స్కానింగ్‌లు, పరీక్షలు, టీకాలు, ఆంటినెంటల్ చెకప్‌ల కోసం వాటిని వినియోగించుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశలు రూపొందించుకున్న షెడ్యూల్ ప్రకారం సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి, అనంతరం స్వగ్రామాలకు తీసుకొస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 2024 ఏప్రిల్ నుంచి 2025 నవంబరు వరకు 3,12,207 మంది గర్భిణులు సేవలను వినియోగించుకున్నారు.

తల్లీ బిడ్డలను ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుస్తున్నాం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీ బిడ్డలను 102 అంబులెన్స్‌లు సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నాయి. శిశువుకు అవసరమైన టీకాలు వేయించడం కోసం ఇంటి నుంచి ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లడం, టీకాలు చేశాక తిరిగి చేర్చుతున్నాయి. మాతా శిశు భద్రత కోసం 102 సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

- కే.రవికుమార్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్



కొల్లాపూరులో..

తండ్రీ కూతుళ్ల పోటీ

- కాంగ్రెస్ పార్టీ మద్దతుతో తండ్రి, స్వతంత్ర అభ్యర్థిగా కుమార్తె

7

నేడు వేతనంతో కూడిన సెలవు


7



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 141.00
హోల్ సేల్	: 149.00
డ్రెస్డ్	: 254.00
స్కిన్ లెస్	: 277.00



పుట్టి ముంచుతారా?

- రెబెల్స్ బెడదతో అభ్యర్థుల్లో టెన్షన్
- నేడు తేలనున్న 128 మంది భవితవ్యం
- మహబూబ్‌నగర్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 433 మంది, వార్డు స్థానాలకు 2,459 మంది పోటీ

7

వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం

- జూనియర్ సివిల్ న్యాయాధికారి సాయి మనోజ్



మాట్లాడుతున్న న్యాయాధికారి సాయి మనోజ్

నారాయణపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దామని నారాయణపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.సాయి మనోజ్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేటలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మనోజ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు ఉద్దేశించినవని చెప్పారు. ప్రపంచంలో పౌర, రాజకీయ హక్కులకు సంబంధించి అంతర్జాతీయ ఒడంబడికలపై అవగాహన కల్పించడానికి ఏటా డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. మానవ హక్కుల ప్రధాన లక్ష్యాలు జాతి, వర్ణ, లింగ, కుల, మత రాజకీయ, ఇతర కారణాలతో వివక్ష లేని జీవనం గడపాలన్నారు. పిల్లలకు చిన్న వయసులో పెళ్లి చేస్తే పెద్ద వారిదే తప్పు అన్నారు. స్త్రీ, పురుష ఆధిక్యత, వరకట్న వేధింపులు, సఖి సెంటరు, ఓల్డేజ్ హోమ్ గురించి, సీనియర్ సిటిజన్ చట్టాలు, వయోవృద్ధులకు న్యాయ సేవలు పథకాలు, సామాన్య ప్రజలు ఎలా న్యాయం పొందాలి వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సురేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మిపతి గౌడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోకారం రిజర్వాయర్‌పై

ప్రభుత్వం పునరాలోచించాలి



న్యాయం చేయలంటూ ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు

చారకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిండి - నార్లాపూర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా చారకొండ మండలంలోని గోకారం వద్ద చేపడుతున్న రిజర్వాయర్‌పై ప్రభుత్వం పునరాలోచించి సామర్థ్యాన్ని తగ్గించి ఎర్రవల్లి, ఎర్రవల్లితండా గ్రామాలను ముంపునకు గురికాకుండా చూడాలని భూ నిర్వాసితుడు ఏకుల ప్రకాశ్ అన్నారు. ఎర్రవల్లిలోని అంబేడ్కర్ చౌరస్తాలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. ఎర్రవల్లి, ఎర్రవల్లితండా పూర్తిగా ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితుల గోడను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచు ఎన్నికలను మూకుమ్మడిగా ఎర్రవల్లి, ఎర్రవల్లితండా గ్రామాల ప్రజలు బహిష్కరించినా ప్రభుత్వానికి చలనం లేకపోడం చాలా దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దుచేసి రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించి ఎర్రవల్లి, ఎర్రవల్లితండా గ్రామాలను ముంపునకు గురికాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దయ్యగౌడ్, పర్వతాలు, అచ్చ, సుగూరి వెంకటయ్య, అంజయ్య, భూ నిర్వాసితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- రాజవంశీయుల ప్రత్యేక పూజలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న రాజవంశీయులు వెంకటాద్రి రెడ్డి, ఉషారాణి

గద్వాల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలోని భీంనగర్‌లో వెలసిన సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గద్వాల సంస్థాన వారసులు ఆధ్వర్యంలో నిర్మాణమైన శ్రీసంతాన వేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతీ ఏటా మార్గశిర బహుళ షష్టి నుంచి మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయంలో అర్చకులు మొదటి రోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం పుణ్యాహవచనం, అంకురారోపణం, ధ్వజారోహణం, భేరీపూజ, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాజవంశీయులు ఉషారాణి, వెంకటాద్రిరెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వైభవంగా కల్యాణోత్సవం



సామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారికి అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. రాజవంశీయులు గద్వాల వెంకటాద్రి రెడ్డి, ఉషారాణి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం గురువారం రాత్రి నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

బాలికల హక్కులు పరిరక్షించాలి



మాట్లాడుతున్న పారా లీగల్ వలంటీర్ రాజసింహుడు

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు అనేక హక్కులు ఉన్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పారా లీగల్ వలంటీర్‌లు రాజసింహుడు, నాగభూషణం పేర్కొన్నారు. బుధవారం భగీరథ కాలనీ సమీపంలో గల గురుకుల పాఠశాల-1లో బాలికల హక్కులు, పరిరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బాలికల పరిర క్షణకు విద్యా ఆరోగ్యం, భద్రత, సమానత్వం ముఖ్యమైనవని అన్నారు. బాలికలు సంరక్షణ కోసం వారి హక్కులు కాపాడేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందన్నారు.

అనంతరం మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ అరుణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆయిల్‌పాంపై ఆసక్తి



ఆయిల్‌పాం గెలలు చూపుతున్న రైతు నిరంజన్ తదితరులు

- ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన సాగు
- ఒకసారి మొక్కలు నాటితే 35 ఏళ్లు రాబడి
- నాలుగేళ్లు ప్రభుత్వమే పెట్టుబడి సాయం
- జిల్లాలో 7978 ఎకరాల సాగు

ఉప్పునుంతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో వినూత్న మార్పులు చేటు చేసుకుంటున్నాయి. వ్యవసాయ ఆధారిత పంటలే కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయిల్‌పాం తోటలకు 90 శాతం సబ్సిడీని అందిస్తున్నది. ఈ క్రమంలో వాణిజ్య పంటల సాగు అయిన ఆయిల్‌పాంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 2020-25 వరకు 2146 మంది రైతులు 7978 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశారు.

ఒకసారి నాటితే 35 ఏళ్లు రాబడి

ఒకసారి ఆయిల్‌పాం మొక్కలు నాటితే 35 సంవత్సరాల వరకు పంట చేతికందుతుందని ఉద్యానశాఖ అధికారి తెలుపుతున్నారు. రైతుకు రాబడి కూడా వస్తుందంటున్నారు. మొదటి సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ప్రోత్సాహకం కింద 4,200 చొప్పున అందిస్తుంది. ఆయిల్‌పాం గెలలు కోత ప్రారంభం అయిందంటే ప్రతీ 15 రోజులకు ఒకసారి గెలలు కోయవల్సి వస్తుంది.

మార్కెట్ ఎక్కడ?

ఫ్రీయూనిక్ కంపెనీ రైతుల నుంచి ఆయిల్‌పాం గెలలను కొనుగోలు చేసి అశ్వారావు పేట ఫ్యాక్టరీకి తీసుకెళ్తున్నారు. ప్రతీ టన్ను 19,400 ధర చెల్లిస్తున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లిలో ప్రస్తుతం ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణం పూర్తయితే నేరుగా విక్రయాలకు అవకాశం ఉంటుంది. మార్కెట్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

● ఆయిల్‌పాం సాగు దిగుబడి ఆశాజనకంగా ఉంది

గత నాలుగు సంవత్సరాల కింద 5 ఎకరాలలో ఆయిల్‌పాం సాగు చేశాను. ఈ ఏడాది జూలైలో మొదటిసారి కోత ప్రారంభం అయింది. ఒక్కనెలలో 2 టన్నులు వచ్చింది. సాధారణ పంటల కంటే ఆయిల్ పాం సాగు బాగుంది.

- నిరంజన్, పెద్దాపూర్, రైతు

● సాధారణ పంటల కంటే ఆయిల్‌పాం మేలు



అచ్చంపేట డివిజన్‌లో ఆయిల్‌పాం సాగుకు ఎర్రనేలలు అనువుగా ఉంటాయి. నీటి వసతి ఉన్న ప్రతీ రైతును నేరుగా కలిసి సాధారణ పంటల కంటే ఆయిల్‌పాం పంటలపై లాభాలు బాగుంటాయి. ప్రభుత్వ రాయితీపై అవగాహన కల్పిస్తూ ఆయిల్‌పాం సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం.

- చంద్రశేఖర్, ఉద్యానశాఖ అధికారి, అచ్చంపేట

యువత భావోద్వేగాలను నియంత్రించుకోవాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత భావోద్వేగాలను నియంత్రించుకోవాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పీయూలోని సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ సెల్, బియాండ్ యువర్ మైండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'చాలెంజెస్ ఫేసింగ్ బై ఉమెన్ అండ్ యూత్' అనే అంశంపై ఒరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురైన ప్రతీ ఛాలెంజ్‌ను ఎంతో సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. యువతకు ప్రస్తుతం విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి ఉద్యోగ అవకాశాలు పొందాలని తెలిపారు. అనంతరం ముఖ్యవక్త సరోజ గుళ్లపల్లి మాట్లాడుతూ మహిళలు, యువత ఎదుర్కొనే పలు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని తెలిపారు. ఆధునిక కాలంలో మహిళలు అంతరిక్షయానంలో రాణిస్తున్నారని, ఆడపిల్లలకు అన్ని అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. అనంతరం పీయూ రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు మాట్లాడుతూ పీయూలో విద్యతో పాటు ఆటలకు, వివిధ రంగాల్లో ప్రోత్సాహం అందిస్తున్నామని, పీయూలో అధిక సంఖ్యలో మహిళా విద్యార్థులు ఉండడం శుభసూచికమన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, ప్రిన్సిపాల్స్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ రవికాంత్, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడే తొలిపోరు

(5వ పేజీ తరువాయి)

మొత్తం స్థానాలను గెలుచుకోవాలనే సంకల్పంతో ఎమ్మెల్యేలు ప్రచారం చేయగా.. మాజీ ప్రజాప్రతినిధులు కూడా ఆయా అభ్యర్థులకు బాసటగా ప్రచారంలో పాల్గొన్నారు. ఇప్పుడు గెలుచుకున్న స్థానాలను బట్టి గ్రామాల్లో తమ పట్టును నిలుపుకోవచ్చని అన్ని పార్టీల నాయకులు భావిస్తున్నారు. ఇక పంచాయతీల్లో పోటీ హోరాహోరీగా సాగుతోంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ఒనసాగనుంది. గంట బ్రేక్ తర్వాత 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు. చిన్న పంచాయతీల్లో గంటలోపే ఫలితాలు వెలువడనుండగా, మేజర్ పంచాయతీల్లో సాయంత్రం 5 గంటల వరకు సమయం పట్టే అవకాశం ఉంది.



ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

492 సర్పంచు స్థానాలకు పోలింగ్..

మొదటి విడతలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 550 సర్పంచు స్థానాలు, 4,840 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ స్థానాల్లో 58 సర్పంచు స్థానాలు, 921 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. అత్యధికంగా గద్వాల జిల్లాలో 15 స్థానాలు ఏకగ్రీవం కాగా.. తర్వాత నారాయణపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలు ఉన్నాయి. అత్యల్పంగా వనపర్తి జిల్లాలో కేవలం ఐదు స్థానాలు మాత్రమే ఏకగ్రీవం అయ్యాయి. అవి పోను 492 సర్పంచు స్థానాలు, 3,919 వార్డు స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక సర్పంచు స్థానానికి, ఒక వార్డు స్థానానికి నామినేషన్ రాలేదు. జడ్చర్ల మండలం శంకరంపేట తండా ఎస్టీకి రిజర్వ్ చేయగా, మునిసిపాలిటీలో విలీనం చేసిన గ్రామం పోను మిగిలిన పంచాయతీలో ఆ కేటగిరీలో అభ్యర్థి లేకుండా పోయారు. దాంతో అక్కడ నామినేషన్ దాఖలు కాలేదు.

12,398 మంది పోలింగ్ సిబ్బంది..

ఎన్నికలకు సంబంధించి ఆయా జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల వద్ద సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 12,398 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. 20 శాతం మంది సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు. ఎన్నికలకు ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల లోపలకు ఓటర్లు, అభ్యర్థులు, ఎంపిక చేసిన పోలింగ్ ఏజెంట్లను మాత్రమే అనుమతించనున్నారు. అక్కడ 144 సెక్షన్ విధించారు. ఉమ్మడి జిల్లాలో బందోబస్తు కోసం 5,088 మంది పోలీసులను కేటాయించారు.

కొండనాగుల డిగ్రీ కళాశాలలో

అకాడమిక్ ఆడిట్ నిర్వహణ



కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

బల్మూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని కొండనాగులలో గల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్ర కాలేజ్ ఎడ్యుకేషన్ శాఖ ఆదేశాల మేరకు అకాడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఫిరంగ రవి తెలిపారు. ఆడిట్ బృందం సభ్యుడు డాక్టర్ వెంకటప్రసాద్, ప్రిన్సిపాల్ పెబ్బేరు డాక్టర్ రామచంద్రరావు తెలుగు విభాగాధిపతి కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. 2022-23-24విద్యా సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను, విద్యార్థులు-అధ్యాపకులు సాధించిన ఫలితాలు, విభాగాల అకాడమిక్ కార్యకలాపాలు వంటి అంశాలను పూర్తిగా పరిశీలించినట్లు తెలిపారు. ఆడిట్ బృందం పరిశీలన అనంతరం కళాశాల అభివృద్ధి కోసం పలు సూచనలు, మార్గదర్శకాలు తెలియజేసినట్లు వారు తెలిపారు.

పీఏసీఎస్ కేంద్రం తనిఖీ

- ధాన్యం కొనుగోలుపై విజిలెన్స్ అధికారుల ఆరా



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మిడ్జిల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేదంరంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఏడీ విజయ్‌కుమార్, సీఐ సురేందర్ రెడ్డి కొనుగోలు చర్యలపై ఆరా తీశారు. ధాన్యం నాణ్యత, తేమ శాతం, బరువుల నమోదు, ధాన్యం నిల్వల పరిస్థితులను ముమ్మరంగా పరిశీలించారు. రైతులకు డబ్బులు సకాలంలో అందుతున్నాయా అన్న విషయంపై పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీవో జి.శ్రీనివాస్, జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, కరుణకర్ రెడ్డి, జంగయ్య, ఆచారి, పార్వతమ్మ పాల్గొన్నారు.

మిర్చి రైతుకు

మంచిరోజులొచ్చేనా?

- గతేడాది రైతు ఆశించిన ధర లేకపోవడంతో అపార నష్టం
- ఈ ఏడాది ఆశగా సాగు చేస్తున్న అన్నదాతలు



యాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో మిర్చి పంటను సాగు చేస్తున్న రైతులు

తాడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గతేడాది ఎన్నో ఆశలతో సాగు చేసిన మిర్చి పంట చేతికందినా.. ధరాఘాతంతో రైతులు నష్టాలు చవిచూశారు. ఈ ఏడాదైనా మంచి రోజులు వచ్చేనా అంటూ ఎదురుచూస్తున్నారు. గత ఏడాది చేతికి అంది వచ్చిన మిరపకాయలను మార్కెట్‌కు తీసుకెళ్లిన పరిస్థితుల్లో ధర పూర్తిగా తగ్గిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది తాడూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని 24గ్రామపంచాయతీల పరిధిలో 1560 ఎకరాల్లో పచ్చిమిరపకాయల పంటను రైతులు సాగు చేశారు. ఈ ఏడాది గతేడాది నష్టాల భయంతో కొంత విస్తీర్ణం తగ్గి 1250ఎకరాలలో సాగవుతున్నది. గతేడాది మాదిరి కాకుండా ఈ ఏడాదైనా దేవుడు కరుణించి పండిన పంటకు గిట్టుబాటు ధర పలికి లాభాలు వస్తాయనే ఆశతోనే రైతులు మిర్చిని సాగు చేశారు. గతేడాది అధిక వర్షాల కారణంగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోగా, పండిన కాస్త పంటకు ధర కూడా లేకపోవడం మూలంగా పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ ఏడాదైనా వారి ఆశలకనుగుణంగా ధర పలికి దిగుబడి మంచిగా వచ్చినట్లయితేనే రైతులు గతేడాది మిగిలిన అప్పులను తీర్చుకునే పరిస్థితి ఉంటుంది.

● మిరప పంటలో ఎదుగుదల బాగానే ఉంది



ప్రస్తుతం మిరప పంటలో మొక్కల ఎదుగుదల బాగానే ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది చీడపీడల బెడద కాస్త తగ్గుముఖంగానే ఉంది. మార్కెట్ పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది. మొత్తంగా పంట దిగుబడి వచ్చినట్లయితే రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగే అవకాశాలే మెండుగా ఉన్నాయి. అవసరమున్న సమయంలో స్థానికంగా ఉండే ఏఈవోల సలహాలు, సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మరింత దిగుబడి పెంచుకునే అవకాశం ఉంటుంది.

- ఏవో సందీప్‌కుమార్‌రెడ్డి

● గిట్టుబాటు ధర రావాలి



మిరప పంట సాగు చేసిన అన్నదాతలకు గతేడాది తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకుగాను మళ్లీ మిరప పంట సాగు చేసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర వచ్చి మంచి దిగుబడి వచ్చినట్లయితేనే అన్నదాతలకు మేలు జరుగుతుంది తప్ప లేకుంటే ఇబ్బందికర పరిస్థితులు ఉండే అవకాశాలు ఉన్నాయి.

- జయపాల్‌రెడ్డి, అకునెల్లికుదురు

గుట్టలు.. గుటకాయస్వాహా!

- అడ్డుకోలేకపోతున్న అధికారులు
- ప్రకృతి సంపదను దోచేస్తున్న భకాసురులు

కొత్తపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని నందిగామ, గోకుల్‌నగర్ గ్రామ శివారుల లో గుట్టల ప్రాంతాలు అధికంగా ఉంటాయి. ఈ గుట్టలను అక్రమార్కులు గుటకాయస్వాహా చేసేస్తున్నారు. పెద్ద పెద్ద బండరాళ్లతో పాటు మట్టి తవ్వకాలను ఇష్టానుసారంగా కొల్లగొడుతున్నారు. కొల్లగొట్టిన రాళ్లను ఎక్కువ మొత్తంలో అమ్ముకొంటున్నారు. మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండానే గుట్టలను తొలగించేస్తున్నారు. అటవీ ప్రాంతాలుగా ఉండే గుట్టలను తొలగించడంతో అడవిలో ఉండే మూగజీవాలు కూడా ప్రమాదంలో పడుతున్నాయి. వాటిని రక్షించే అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చారిత్రాత్మక గుట్టలను తొలగించకుండా చూడాలని కోరుతున్నారు.

ముఖ్యంగా బోరుబావులకు ఉచిత విద్యుత్ ప్రభుత్వం అమలు చేయగా, దానిని బండరాళ్లు పగలగొట్టే అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా వినియోగించడం గమనార్హం. అటువైపుగా అధికారుల చూపు లేకపోవడంతో వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా మైనింగ్, కరెంట్ అధికారులు స్పందించి బండరాళ్లను తొలగించడం ఆపాలని కోరుతున్నారు.

● కొత్తపల్లి తహసీల్దార్ జయరాములును వివరణ కోరగా... మండలంలో ఉన్న గుట్ట ప్రాంతాల్లో బండరాళ్లు, మట్టిని తోడటానికి ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్నారు. ఇలాంటి సంఘటనలు మా దృష్టికి వస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

● విద్యుత్ ఏఈ పెద్దకొట్ల బాలరాజ్‌ను వివరణ అడుగగా... గుట్ట ప్రాంతంలో బండరాళ్లను తొలగించడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ మధ్యనే మాకు సమాచారం అందిందని, ఎన్నికల తర్వాత పరిశీలించి విద్యుత్ వియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



నందిగామ శివారులో అక్రమంగా తొలగిస్తున్న బండరాళ్లు

చుక్కలు చూపిస్తున్న

చలి గాలులు

- నాలుగు రోజులుగా పెరిగిన తీవ్రత

ఉప్పునుంతల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా చలి పంజా విసురుతోంది. ఉదయం పది అయినా చలి వీడడం లేదు. ఎన్నికల వేళ అభ్యర్థులు ప్రచారం చేసుకొనేందుకు ఇబ్బందిగా మారింది. చల్లని గాలులు వీస్తుడడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయ పడుతున్నారు. యాసంగిలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరి పరిస్థితిలో పంట పొలాలకు వెళ్లా[illegible]రై తులకు కష్టాలు తప్పడంలేదు. పల్లెలో ప్రజలు ఉదయం, రాత్రి వేళలో చలిమంటలు వేసుకొంటున్నారు.



[illegible]

చలి విపరీతమైంది



మూడు రోజుల నుంచి చలి బాగా పెడుతుంది. బయటకు వెళ్లాలంటేనే భయమేస్తున్నది డ్రైవింగ్ చేసేటప్పుడు ఇబ్బంది అవుతున్నది. చలి ఇట్లే ఉంటే బయటకు వెళ్లడం కష్టం.

- సత్యనారాయణ యాదవ్, డ్రైవర్

● నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతల నమోదు ఇలా

గడచిన నాలుగు రోజులుగా అచ్చంపేట ప్రాంతంలో ఉష్ణోగ్రతలు కింద పేర్కొన్న విధంగా నమోదవుతున్నాయి.

7న కనిష్ఠం: 16 గరిష్ఠం: 28
8న కనిష్ఠం: 15 గరిష్ఠం: 28
9న కనిష్ఠం: 16 గరిష్ఠం: 30
10న కనిష్ఠం: 14 గరిష్ఠం: 29



మంచులో లైట్లు వేసుకుని వస్తున్న కారు

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

» నసరుల్లాబాద్‌లో ప్రచారం సందర్భంగా ఘటన



వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్‌లో బుధవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు వేర్వేరుగా ప్రచారం నిర్వహిస్తూ ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఒకరిపై మరొకరు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, వాగ్వాదానికి దిగారు. ఒక దశలో తోపులాట జరిగి, దాడి చేసుకునే దిశకు చేరింది. సమాచారం అందుకున్న జడ్చర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపచేశారు. ఆ తర్వాత ఎవరికి వారు గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

కొల్పూరులో తండ్రీ కూతుళ్ల పోటీ





తండ్రీ కూతుళ్లు రాములు, నవ్యశ్రీ

కృష్ణ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మాగనూరు మండల పరిధిలోని కొల్పూరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తండ్రీ కూతుళ్లు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో తండ్రి మద్దు రాములు, స్వతంత్ర అభ్యర్థిగా కుమార్తె మద్దు నవ్యశ్రీ బరిలో దిగారు. రెండో విడతలో ఎన్నికలు జరుగనున్న ఈ గ్రామ పంచాయతీలో వీరిద్దరితో పాటు బీజేపీ మద్దతుతో మరొకరు బరిలో ఉన్నారు. కొల్పూరు తో పాటు, ఆమ్లెట్ గ్రామాలు గజరందొడ్డి, పుంజునూరులలో 1,500 ఓటర్లు ఉన్నారు. తండ్రీ కూతుళ్లలో ఎవరు విజయం సాధిస్తారో వేచి చూడాలి.

నేడు వేతనంతో కూడిన సెలవు

» నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న వేతనంతో కూడిన సెలవును ప్రభుత్వం ప్రకటించిందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. నేడు మొదటి విడత ఎన్నికలు నిర్వహించనున్న ప్రాంతాల్లో ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమల సిబ్బందికి కూడా వేతనంతో కూడిన సెలవు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు మంగళవారం కూడా సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే బుధవారం కూడా సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఓటు వజ్రాయుధం లాంటిదని ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దని సూచించారు. ఓటు వేయడానికి 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించవచ్చని తెలిపారు.

పుట్టి ముంచుతారా?



» రెబెల్స్ బెడదతో అభ్యర్థుల్లో టెన్షన్ » నేడు తేలనున్న 128 మంది భవితవ్యం

» మహబూబ్‌నగర్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 433 మంది, వార్డు స్థానాలకు 2,459 మంది పోటీ

మహబూబ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తొలి విడత ఎన్నికలకు రంగం సిద్ధమైంది. నేడు మహబూబ్‌నగర్ జిల్లా లోని మొదటి విడతలో 139 గ్రామ పంచాయతీకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో ఇప్పటికే 10 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా, జడ్చర్ల మండలం శంకరాయపల్లి తండాకు కేటాయించిన రిజర్వేషన్ కేటగిరీ ఓటర్లు లేకపోవడంతో అక్కడ సర్పంచ్‌కు ఎన్నిక జరగడం లేదు. మిగిలిన 128 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు 1,188 వార్డు స్థానాలకు గాను, 264 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన 923 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 128 సర్పంచ్ స్థానాలకు 433 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, 923 వార్డు సభ్యుల స్థానాలకు 2,459 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నేడు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు ముగియనుండగా, ఆ తరువాత ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. అనంతరం వార్డు సభ్యులు చేతులెత్తే పద్ధతిలో ఉప సర్పంచ్‌లను ఎన్నుకుంటారు. ఎన్నికల సరళిని 12 వెబ్ కాస్టింగ్‌ల ద్వారా అధికారులు పర్యవేక్షించనున్నారు.

తిరుగుబాట్లతో తలనొప్పి

ఎన్నికల ప్రచారం వారం, పది రోజులుగా హోరాహోరీగా కొనసాగింది. అయితే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన తిరుగుబాటు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు రెబల్స్‌గా ఎన్నికల బరిలో ఉన్నారు. చాలా గ్రామాల్లో వారు చివరి వరకు పోటీనుంచి తప్పుకోకపోవడం పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారనున్నది. రెబల్స్ తమ పుట్టి ముంచుతారా అన్న టెన్షన్ ప్రధాన అభ్యర్థుల్లో నెలకొన్నది. వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న వారిలో చాలా మంది ఉపసర్పంచ్ పదవి కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు. అందుకు మద్దతిచ్చే వార్డు సభ్యులను గెలిపించుకునేందుకు, తమకు పోటీ వస్తారనుకున్న అభ్యర్థులను ఓడించేందుకు యత్నిస్తున్నారు. సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం లేని చోట్ల, కొందరు పెద్ద నాయకులు వార్డు స్థానాలకు పోటీ చేస్తున్నారు.గెలిచి ఉపసర్పంచ్ పదవి దక్కించుకుని, గ్రామం మీద పట్టు నిలుపుకోవాలని ఆశిస్తున్నారు. ఇక వలస ఓటర్లను రప్పించేందుకు హైదరాబాద్‌లో బస్సులు, డీసీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. ముందు రోజే తమ అనుచరులను పంపించి, వలస ఓటర్లను సమీకరించి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. మరికొందరు ఓటర్లకే డబ్బులు ఇచ్చి, వారే వచ్చి ఓటు వేసేలా ప్రణాళికను రూపొందించుకున్నారు.



కాకర్లపహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తులో ఉన్న పోలీసులు

పల్లెల్లో ఎన్నికల జాతర

పల్లెల్లో ఎన్నిక జరిగే గురువారం రోజు జాతర వాతవరణం కనిపించనుంది. సర్పంచ్ ఎన్నికల్లో ఓటేసేందుకు వృత్తి, ఉద్యోగ, ఉపాధి, ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇతర ప్రాంతాల్లో ఉండే వారందరూ స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో 85 నుంచి 90 శాతం మేర పోలింగ్ కానుంది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి జాతరను తలపిస్తోంది. ఇదే క్రమంలో సమస్యాత్మక గ్రామాలలో గొడవలు కూడా జరిగే అవకాశం ఉంది. మొదటి విడతలో 29 సమస్యాత్మక గ్రామా లుండగా, 294 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది.

జోరుగా ప్రలోభాల పర్వం

ఇన్నాళ్ళు జోరుగా ప్రచారం చేసిన అభ్యర్థులు చివరి ప్రయత్నంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలూ చేసినట్లు సమాచారం. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో నాయకులు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అలాంటి చోట ఓటుకు రూ.500 నుంచి రూ. 1000 వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఓటర్లకు పెద్ద ఎత్తున మద్యం పంపిణీ చేసినట్లు తెలిసింది. మహిళలకు చీరలతో పాటు, ఇతర బహుమతులను పెద్దఎత్తున అందించినట్లు తెలిసింది.

స్వగ్రామాల్లో జనం - బోసిపోయిన పట్టణం

అచ్చంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల పోలింగ్ ఈ నెల 11న జరుగనున్నది. అందుకోసం ఉద్యోగాలు, వ్యాపారాలు, ఉన్నత చదువుల కోసం పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న ప్రజలు ఎన్నికల కోసం స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో పాటు వివిధ పనుల కోసం ప్రతీ రోజు సమీప పట్టణాలు, మునిసిపాలిటీలకు వచ్చే వారు సైతం గ్రామాలకే పరిమితం అయ్యారు. ఈ క్రమంలో అనునిత్యం సందడిగా ఉండే నియోజకవర్గ కేంద్రమైన అచ్చంపేట పట్టణం మంగళ, బుధవారాల్లో జనం లేక బోసిపోయి కనిపించింది. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోనే తిష్ట వేశారు. హోటళ్లు, దాబాలు వద్ద, పొలం గట్ల మీద గ్రామాల ముఖ్య నాయకులతో వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేసుకున్నారు.



నిర్మానుష్యంగా మారిన అచ్చంపేట పట్టణం



తెలుసుకుందాం!

మేజర్ పంచాయతీ అంటే..!

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో మేజర్ గ్రామ పంచాయతీలు వేరు. ఆ గ్రామ పంచాయతీల్లో జనాభాతో పాటు ఆదాయమూ అధికంగా ఉంటుంది. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఎక్కువ నిధులు, వనరులు అందుబాటులో ఉంటాయి. చిన్న గ్రామ పంచాయతీల కన్నా ఎక్కువ అధికారులుంటాయి.

ఇవీ ముఖ్య లక్షణాలు

- అధిక పన్నులు, ప్రభుత్వ గ్రాంట్లు, ఇతర ఆదాయ మార్గాలతో ఆర్థికంగా బలంగా ఉంటుంది.
- పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రోడ్లు, నీటి సరఫరా వంటి సదుపాయాలకు ఎక్కువ ఖర్చు చేయగలరు.
- కార్యనిర్వహణ అధికారి లేదా పంచాయతీ కార్యదర్శి వంటి అదనపు సిబ్బందిని నియమించుకోవచ్చు.
- ప్రభుత్వ అభివృద్ధి పథకాల్లో ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుంది. ఎన్నికల సమయంలో కూడా ఎక్కువ ఖర్చు, డిమాండ్ ఉంటుంది.
- చిన్న గ్రామ పంచాయతీకి రూ.లక్ష వరకు ఖర్చు చేసే అవకాశం ఉంటే, మేజర్ పంచాయతీలకు అంతకంటే ఎక్కువ నిధులు అందుబాటులో ఉన్నాయి.
- సంక్షిప్తంగా, మేజర్ పంచాయతీ అనేది గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా, జనాభా పరంగా బలంగా ఉండే పెద్ద గ్రామ స్వపరిపాలన విభాగమని చెప్పవచ్చు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలో ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి. ఓటరు స్లిప్‌తో పాటు గుర్తింపు కార్డును వెంట తీసుకెళ్లాలి. అందుకోసం ఎన్నికల సంఘం 18 రకాల గుర్తింపు కార్డులను సూచించింది. వాటిలో ఏదైనా ఒక దాన్ని చూపించి, ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తింపు కార్డులు ఇవీ..

- ఆధార్‌కార్డు, పీహెచ్‌సీ ఫొటో గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన ఐడెంటిటీ కార్డులు
- బ్యాంకులు, కో ఆపరేటివ్ సంస్థలు ఉద్యోగులకు ఇచ్చే గుర్తింపు కార్డులు
- ప్రభుత్వం ఇచ్చే హెల్త్‌కార్డు, జాతీయ జనాభా నమోదు (ఎన్‌పీఆర్)కార్డు
- ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు
- కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా పథకం కార్డు
- మాజీ సైనికులు, వితంతువులు, వృద్ధుల పింఛన్ పుస్తకం లేదా పత్రం
- ఫొటోతో కూడిన రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం
- స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు
- ఫొటోతో ఉన్న ఆయుధ లైసెన్స్
- దివ్యాంగుల ధ్రువపత్రం
- ఫొటోతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య హోరాహోరీ

పలు స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రాజీ

మహబూబ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య పోరు నువ్వానేనా అన్నట్లుగా సాగుతోంది. బీజేపీ మూడోవంతు స్థానాలకే పరిమితమైంది. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో 1218 గ్రామ పంచాయతీలు ఉండగా 121 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. వీటిలో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్నది. 1218 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతుండగా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 1082 స్థానాల్లో, బీఆర్ఎస్ మద్దతుదారులు 841 స్థానాల్లో, బీజేపీ మద్దతుదారులు 302 సర్పంచు స్థానాలకు పోటీ చేస్తున్నాయి. అక్కడక్కడ కమ్యూనిస్టు పార్టీలు, స్వతంత్రులు కూడా బరిలో ఉన్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లాలో 423 పంచాయతీలు ఉండగా 30 చోట్ల ఏకగ్రీవం అయ్యాయి. 393 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో కాంగ్రెస్ 386 స్థానాలకు పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ 366 స్థానాలలో, బీజేపీ 124 స్థానాలలో పోటీ చేస్తున్నాయి. బీజేపీ పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తోంది. ఇందులో కాంగ్రెస్‌కు 8 చోట్ల మద్దతు ఇస్తుండగా, బీఆర్ఎస్‌కు 36 చోట్ల మద్దతు ఇస్తోంది. నాలుగుచోట్ల బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇస్తోంది. పలుచోట్ల ఉపసర్పంచ్ కోసం బీఆర్ఎస్ ఆయా పార్టీలతో గ్రామ స్థాయిలో రాజీ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. కాగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సొంతూరు ధమగ్నాపూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య టఫ్‌ఫైట్ నడుస్తోంది. ఇక్కడ బీజేపీ పోటీలో ఉన్నా ఆ పార్టీ బీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తుండటంతో పోటీ ఉత్కంఠభరితంగా సాగుతోంది. కాగా గతంలో ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్న సమయంలో ఆయన సొంతూరు అన్నాసాగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఎన్నికలో ప్రతీకారం తీర్చుకునేందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ సొంతూరులో బీఆర్ఎస్‌ను గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ గట్టి ప్రయత్నమే చేస్తోందన్న చర్చ సాగుతోంది. ఇక జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సొంతూరు రంగారెడ్డిగూడలో మూడు పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నా ఇక్కడ కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా 40 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో కాంగ్రెస్ 37, బీఆర్ఎస్ పార్టీ రెండు, బీజేపీ మద్దతుదారులు ఒకరు ఉన్నారు. మిగిలిన మొత్తం 215 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు పోటీలో ఉన్నారు. వీరికి రెబల్‌గా దాదాపు 40 మంది వరకు ఉన్నారు. బీఆర్ఎస్ వారు 162 మంది వరకు ఉన్నారు. బీజేపీ మద్దతుదారులు 29 మంది వరకు ఉన్నారు. 357 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు. గద్వాలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత అనుచరుల మధ్యే చాలా గ్రామాలలో పోటీ ఉంది. బీఆర్ఎస్, బీజేపీ కలిసి పనిచేయడం లేదు. కానీ బీజేపీ అభ్యర్థులు, బీఆర్ఎస్ అభ్యర్థులు లేని గ్రామాలలో సరిత వర్గం వారికి కొందరు పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్వగ్రామం బూరెడ్డిపల్లిలో కాంగ్రెస్, నడిగడ్డ హక్కుల పోరాట సమితుల మధ్య పోటీ నెలకొన్నది.

● నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య పోటాపోటీ నెలకొన్నది. దీంతో పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది. జిల్లాలో 272 పంచాయతీలలో 34 ఏకగ్రీవం అయ్యాయి. 238 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్ 230 స్థానాల్లో, 139 బీఆర్ఎస్, 95 స్థానాల్లో బీజేపీ, ఎనిమిది చోట్ల కమ్యూనిస్టు పార్టీల మద్దతుదారులు పోటీలో ఉన్నారు. కాగా అత్యధికంగా కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ మద్దతుదారులే రేబల్‌గా పోటీలో ఉన్నారు. స్వతంత్రులు 243 మంది పోటీలో ఉన్నారు.

● వనపర్తి జిల్లాలో 268 గ్రామ పంచాయతీలు ఉండగా 17 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మూడు విడతల్లో 251 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా చిన్నంబావి, పాన్‌గల్, అమరచింత, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి మండలాల్లోని 50 గ్రామాలలో బీఆర్ఎస్ , బీజేపీ పార్టీలలో లోపాయికారి ఒప్పందం పెట్టుకుని ఇరు పార్టీల నుంచి ఒక్కరే అభ్యర్థిని బరిలోకి దింపారు. అధికార పార్టీ కాంగ్రెస్ 251 గ్రామాలలో పోటీ చేస్తుండగా, 30 గ్రామాలలో అదే పార్టీ నుంచి రెబల్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ 174 స్థానాలలో, బీజేపీ 54 స్థానాలలో పోటీ చేస్తుంది. పలు చోట్ల అధికార పార్టీలోని రెబల్ అభ్యర్థులకు మద్దతుగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బహిరంగంగానే ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, స్వగ్రామం కానాయపల్లి గ్రామంలో కాంగ్రెస్ , టీఆర్ఎస్ బీజేపీ పార్టీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక్కడ అధికార పార్టీనే గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మొత్తానికి రాజకీయం రసవత్తరంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



యుగంధర్ (ఫైల్)

ఖిల్లాఘణపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణ పురం పీఏసీఎస్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న యుగంధర్‌గౌడ్ (28) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని అల్లమాయపల్లి గ్రామానికి చెందిన యుగంధర్ గౌడ్ తన స్నేహితుడు రాఘ వేందర్‌గౌడ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లాడు. అతడిని అక్కడ వదిలేసి, స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, శంషాబాద్ సమీపం లోని తొండుపల్లి బ్రిడ్జి వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న డీసీఎం అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ద్విచక్రవాహనం దహనం

పెబ్బేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని చిన్న గుమ్మడం గ్రామంలో కావలి మద్దిలేటికి చెందిన బైకును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. మంగళవారం అర్ధరాత్రి మద్దిలేటితో పాటు, కుటుంబ సభ్యులందరూ ఇంట్లో నిద్ర పోతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ప్రధాన ద్వారానికి బయట నుంచి గొళ్లె వేసి, ద్విచక్ర వాహనానికి నిప్పంటించారు. సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టిప్పర్, ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

కృష్ణ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ శివారులో టిప్పర్ ట్రాక్టర్ ఢీకొని ఒకరు గాయపడ్డారు. కొత్తపల్లి గ్రామం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు పత్తి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను, గుల్బర్గా నుంచి రాయచూరుకు వెళ్తున్న టిప్పర్ ఢీకొన్నది. ట్రాక్టర్ బోల్తా పడటంతో కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు సురేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నవీద్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన సురేశ్‌ను రాయచూర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్పులు తీర్చలేక యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారం కోసం చేసిన అప్పులను తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన కాటికె మహేశ్ (23) ఎక్స్‌కవేటర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల సెకండ్‌హ్యాండ్ కార్లు కొని, విక్రయించే వ్యాపారం ప్రారంభించాడు. అందుకోసం చేసిన అప్పులను తీర్చలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో మనస్తాపానికి గురైన మహేశ్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని సీఐ కమలాకర్ తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో కానిస్టేబుల్

» అడ్డుకున్న ప్రత్యర్థులు, నంచర్లలో ఉద్రిక్తత

» అదనపు కలెక్టర్‌కు ఫోన్, విచారణ చేపట్టాలని ఆదేశం



కానిస్టేబుల్‌ను అడ్డుకుంటున్న ప్రత్యర్థులు

మహబూబ్‌గర్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల పోలింగ్ ముందు రోజు ఓటర్లను ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు, వారి మద్దతుదారులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ మండలంలోని నంచర్లలో ఓ ఉపాధ్యాయుడి భార్య సర్పంచ్‌గా పోటీ చేస్తోంది. ఈ క్రమంలో ఆ అభ్యర్థికి సోదరుడైన పోలీస్ కానిస్టేబుల్ మున్నూర్ నరేశ్ బుధవారం రాత్రి గ్రామంలో ఓటర్లను కలుస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. విషయాన్ని గుర్తించిన ప్రత్యర్థులు అతడిని అడ్డుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూ, ఎన్నికల ప్రచారం చేస్తావా అంటూ నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. నేను పోలీస్ కానిస్టే బుల్‌ను, ఏమనుకుంటున్నావంటూ బెదిరింపులకు దిగడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఒకరిపై మరొకరు చేయి చేసుకొనే వరకూ వెళ్లింది. ఈ విషయంపై ప్రత్యర్థులు అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. సంఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని అయన తహసల్దార్‌ను ఆదేశించినట్లు వారు తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

» రాళ్ల కింద పడి బుల్లెట్ బండి ధ్వంసం

వడ్డేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండల పరిధిలోని వెంకట్రామనగర్‌లో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాలీలోని రాళ్లు పక్కనే ఉన్న బుల్లెట్ బండిపై బడి ధ్వంసమైంది. మండలంలోని కొంకల గ్రామంలో ఓ ఇంటి నిర్మాణం కోసం బుధవారం ఊట్కూరు నుంచి రాళ్ల లోడ్‌తో ట్రాక్టర్ బయలుదేరింది. వెంకట్రామనగర్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ట్రాలీలో ఉన్న రాళ్లు ఎగిరిపడి దేవేంద్ర అనే వ్యక్తి ఇంటి ముందు నిలిపి ఉంచిన బుల్లెట్ బండిపై పడటంతో అది ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.



బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ, బండ రాళ్లు మీద పడటంతో ధ్వంసమైన బుల్లెట్

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడి మృతి

» ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం



రమణారెడ్డి(ఫైల్)

గద్వాల క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వేణుకాలనీలో నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమణారెడ్డి (55) అయిజ మండలంలోని చిన్నతాండ్రపాడులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన చిట్టీలతో పాటు, ఇతర ఆర్థిక లావా దేవీలు నిర్వహించేవారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మంగళవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు అతడిని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. అతడికి భార్య స్వరూపారాణితో పాటు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ధరూరులో తల్లీ, కొడుకులు..

ధరూరు (ఆంధ్రజ్యోతి) : ఫ్రిడ్జ్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడిన తల్లీ, కొడుకులు చికిత్స పొందుతూ మృతి చెందారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల కేంద్రంలోని ఓ ఇంట్లో ఐదు రోజుల క్రితం ఫ్రిడ్జ్ సిలిండర్ పేలి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశ్విని(22), నవీన్ ఆమె కుమారుడు (11 నెలలు) బుధవారం మృతి చెందారు. మరో మహిళ సరోజ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు.





అశ్విని, నవీన్ (ఫైల్)

న్యూస్ బాక్స్..

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

- షోకాజ్ నోటీస్ జారీ

గండీడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జోనల్ అధికారికి కలెక్టర్ విజయేందిర బోయి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని విశ్వభారతి కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఉదయం 10.30 గంటల సమయంలో సందర్శించగా, అప్పటికీ జోనల్ అధికారైన పంచాయతీ రాజ్ ఏఈ విధులకు హాజరు కాలేదు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా ఎన్నికల నిబంధనల మేరకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈర్లపల్లి, ఈర్లపల్లితండాకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లలిత, శంకర్‌నాయక్, నరసింహ, జంగయ్య, రమేశ్, చిన్నవెంకటయ్య, రవి, పూల్యా, తిరుపతి కాంగ్రెస్‌లో చేరగా వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అన్నప్రసాద షెడ్ ప్రారంభం

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని కల్వకుర్తి రోడ్డులో గల అయ్యప్ప స్వామి ఆలయంలో రూ.8 లక్షలతో నిర్మించిన అన్నప్రసాద షెడ్‌ను బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రధానరహదారి నుంచి ఆలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం అయ్యప్ప మాలధారణ స్వాములతో కలిసి భిక్ష చేశారు. అంతకుముందు అయ్యప్ప భక్తులు ఎమ్మెల్యేను సన్మానించారు.

కొనసాగిన ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆర్ఎన్ఆర్ 161 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.2,651, కనిష్ఠంగా రూ.2,505 పలికింది. హంస 29 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1,961, కనిష్ఠంగా రూ.1,957 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

పోరాట యోధుడు పండుగ సాయన్న

- మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్



నివాళి అర్పించిన అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల కోసం పోరాటం చేసిన యోధుడు పండుగ సాయన్న అని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. పట్టణంలోని సిగ్నల్‌గడ్డ వద్ద పండుగ సాయన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనవంతుల వద్ద కొట్టేసినదంతా పేద ప్రజలకు పంచిపెట్టారన్నారు. నిజాం నిరంకుశ పాలకులను ధైర్యంగా ఎదిరించిన గొప్ప వ్యక్తి అని, పటేల్, దేశ్‌ముఖ్‌లను సైతం ఎదిరించి పోరాడాడని కొనియాడారు. పండుగ సాయన్న చిత్ర పటానికి బాదేపల్లి మాజీ సర్పంచ్ రేణుక, లక్ష్మమ్మ, పిట్టల మురళి, వీడియో శ్రీను, నర్సింహులు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

» ఎన్నికల సామగ్రితో గ్రామాలకు తరలివెళ్లిన అధికారులు



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న అధికారులు



గండీడ్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రాజాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు గురువారం నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలో 22 సర్పంచ్, 140 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు 185 పోలింగ్ స్టేషన్లను, నలుగురు జోనల్ అధికారులను, 198 మంది పీవోలను, 225 మంది ఓపీవోలను, 24 మంది కౌటింగ్ అధికారులను, ఏడుగురు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 23 గ్రామాల్లో నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ప్రత్యేక బస్సుల్లో తరలించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా ఎన్నికల అబ్జర్వర్ కాత్యా యిని దేవి పరిశీలించారు.

● మహబూబ్‌నగర్ రూరల్ : రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో మొదటి విడత ఎన్నికలకు అధికారులు సిద్ధం చేశారు. 24 గ్రామ పంచాయతీలకు గాను ఓబ్లాయిపల్లి సర్పంచు ఏకగ్రీవం కాగా, 23 గ్రామాలకు గురువారం పోలింగ్ జరగనుంది. బుధవారం అన్ని గ్రామాలకు ఎన్నికల సామగ్రిని ఎంపీడీవో కరుణశ్రీ పంపిణీ చేశారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

మహమ్మదాబాద్/గండీడ్ : పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ విజయేదిర బోయి ఎన్నికల అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో భాగంగా బుధవారం మహమ్మదాబాద్, గండీడ్ మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. గురువారం నిర్వహించే పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విద్యాసాగర్‌రెడ్డి, మల్లికార్జున్ రావు, ఎంపీడీవోలు నరేందర్‌రెడ్డి, మంజుల పాల్గొన్నారు. కాగా మహమ్మదాబాద్ మండలంలో 22 పంచాయతీలకు గాను ఒకటి, 186 వార్డులకు 42 ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 21 పంచాయతీలకు, 144 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గండీడ్ మండలంలో 25 పంచాయతీలకు, 228 వార్డులకు 68 ఏకగ్రీవం కాగా, మిగిలిన 160 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



జడ్చర్ల మునిసిపాలిటీలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని బాదేపల్లి, జడ్చర్ల, కావేరమ్మపేటలో రూ.14 కోట్లతో నిర్మించే స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం అధికారులు పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, డీఈ మల్లేష్, విద్యుత్‌శాఖ ఏడీఈ చంద్రశేఖర్ పట్టణంలోని నేతాజీచౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డకు వెళ్లే దారిలో వెంకటరమణ టాకీస్ సమీపంలో వర్షం నీరు నిలిచే ప్రాంతంతో పాటు కావేరమ్మపేటలో జరిగే నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు చేపట్టాల్సిన చర్యలు పరిశీలించారు.

ఘనంగా సప్తశక్తి సంగ కార్యక్రమం



పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళలు

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేట సరస్వతి శిశు మందిరంలో ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహిళల చైతన్య వేదిక సప్తశక్తి సంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జ్యోతి మాట్లాడుతూ.. ఝాన్సీలక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, జిజియాబాయ్ మహిళలకు ఆదర్శమన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, భూసంరక్షణ, వాతావరణ సంరక్షణ, పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మలీల, శివరేఖ, అలివేల, జయలక్ష్మీ, నోముల కృష్ణయ్య, మహేష్ పాల్గొన్నారు.

శబరిమలగా విరాజిల్లుతున్న అయ్యప్ప కొండ



పద్మావతికాలనీలో కొండపై వెలిసిన అయ్యప్ప ఆలయం

మమబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పద్మావతి కాలనీలోని కొండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్య పూజలతో మరో శబరిమల కొండలా విరాజిల్లుతోంది. ఆలయ పూజారి అన్వేష్ గురుస్వామి, పంబరాజు గురుస్వామి ఆధ్వర్యంలో భక్తులు మాలధారణ చేస్తున్నారు. నిత్యం సమీప కాలనీల ప్రజలతో పాటు ప్రతీ బుధవారం స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

28 ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం..

మహబూబ్‌నగర్ నగరంలో 28 ఏళ్ల క్రితం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కొండపై నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని ఏకశిలతో రూపొందించడంతో ఆలయానికి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అప్పటి జిల్లా కలెక్టర్, మంత్రి సహకారంతో కొండపై స్థలం సేకరించి ఆలయ నిర్మాణం ప్రారంభించారు. ఆలయ నిర్మాణ సమయంలో కేవలం గణపతి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి గుడి కట్టారు. అనంతరం మణికంఠ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయ్యప్ప సేవా సమాజాన్ని ఏర్పాటు చేసి నిధులు సేకరించి ఆలయ నిర్మాణాన్ని సుందరీకరించారు.

నిత్యాన్నదానం

అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లుగా నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం ఆరంభం నుంచి డిసెంబరు 31 వరకు మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు అన్నదానం నిర్వహిస్తారు. రోజుకు సుమారు 200 నుంచి 300 మంది స్వాములు అన్నదాన కార్యక్రమానికి వస్తారు. అయ్యప్ప కొండపై ప్రతీ ఏటా డిసెంబరు 25న మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రక్తదాన, నేత్రదాన శిబిరాలు నిర్వహిస్తారు.

మానవ హక్కులకు భంగం కలుగకుండా చూడాలి

» జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర



జిల్లా జైలులో ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇందిర

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులకు భంగం కలుగకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా జైలులో, ఎనుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో మనిషి జీవించడానికి రాజ్యాంగం కొన్ని హక్కులు కల్పించందన్నారు. వాటిని మంచి పనులకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే నేరమవుతందన్నారు. బాధ్యతను మరిచి ఎవ్వరు ప్రవర్తించవద్దని సూచించారు. నేర ఆరోపణలతో జైలుకు వచ్చి మీకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను కోల్పోయారన్నారు. ఇక్కడి శిక్ష కాలంలో సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లి తప్పులు చేయకుండా జీవించాలన్నారు. తప్పు చేసిన ప్రతీ మనిషికి జైలు అనేది మార్పు చెందడానికి ఓ పాఠశాలలా ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ బాధ్యతలను గుర్తించి సమాజంలో మంచిగా జీవించాలన్నారు. తమపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలన్నారు. జైలులో శిక్ష కాలంలో ఆసక్తి గల రంగంలో నైపుణ్యం సాధించాలన్నారు. ఖైదీల సంక్షేమం విషయంలో ఇబ్బందులు పెడితే జైలు అధికారులకు తెలపాలన్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ రవీందర్ నాయక్, న్యాయవాదులు కృష్ణ, యోగేశ్వర్ రాజ్, కార్తీక్, మల్లారెడ్డి, పీఎల్వి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నలింగాల్‌చెడ్ రూపు రేఖలు మారుస్తా

» సర్పంచ్ అభ్యర్థి జి.శశికళ ప్రవీణ్



గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి జి.శశికళ ప్రవీణ్

కోయిలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నలింగాల్‌చెడ్ గ్రామ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేసి, గ్రామ రూపురేఖలు మారుస్తానని సర్పంచ్ అభ్యర్థి జి.శశికళ ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పర్సు గుర్తుకు ఓటు వేసి తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలోని అన్ని కూడళ్లలో హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తానని తెలిపారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డి సహకారంతో గ్రామానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ప్రధాన రోడ్డు నుంచి గ్రామంలోకి, కొతలాబాద్ రోడ్డు నుంచి లింగాల్‌చెడ్ తండా వరకు బీటీ రోడ్డు వేయిస్తానన్నారు. గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు నూతన పింఛన్లు మంజూరు చేయిస్తానని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ఏ సమస్య వచ్చిన పరిష్కరిస్తానని తనను గెలిపించాలని కోరారు.

అన్ని వసతులు కల్పించాలి

దేవరకద్ర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కావల్సిన అన్ని వసతులు కల్పిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని నాగారం పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి, మాట్లాడారు. రెండో విడత స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 18 గ్రామ పంచాయతీలు, 168 వార్డులు ఉన్నాయని, అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మూసాపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన కటిక ఖాజా అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల నాయకుడు మున్నూరు రమేష్ పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీనివాస్, శంకర్, నాగరాజు, మల్లేష్, లక్ష్మయ్య, రామకృష్ణ, ఓంకార్, నాగయ్య ఉన్నారు.

బాలోత్సవం ప్రవేశ గడువు 15 వరకు పెంపు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లల మర్రి బాలోత్సవం 4వ పిల్లల జాతరలో పాల్గొనేందుకు గూగుల్ ఫారం పంపేందుకు గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు బాలోత్సవం కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెట్రీ వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న దృష్ట్యా వారి విజ్ఞప్తుల మేరకు బాలోత్సవం కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19, 20 తేదీల్లో నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లో బాలోత్సవం జరుపుతున్నామని తెలిపారు. ఇందులో ప్రవేశం పూర్తి ఉచితం అన్నారు.

అభ్యర్థులు తప్పని సరిగా లెక్క చూపాలి

» రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాస్‌బాబు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాస్‌బాబు

భూత్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు రోజు వారి ఖర్చుల వివరాలు ప్రతీ రోజు తప్పనిసరిగా రాయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సర్పంచులు, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం పోటీల్లో ఉన్న ప్రతీ అభ్యర్థి తప్పకుండా ఖర్చుల లెక్కలను చూపించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడ కూడా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయరాదని, ప్రలోభాలకు లొంగదీయరాదని సూచించారు. ఎన్నికల నిబంధనలు ప్రతీ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల నోడల్ అధికారి టైటస్ పాల్, మండల ఎన్నికల అధికారి ఉమాదేవి, అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ ఆఫీసర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

20న అబ్దుల్‌ఖాదర్ దర్గా ఉర్సు



అబ్దుల్‌ఖాదర్ దర్గా ఉర్సు పోస్టర్‌ను విడుదల చేస్తున్న మత పెద్దలు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్‌ఖాదర్ షా బాబా రహెమాతుల్లా అలై 87వ ఉర్సు వేడుకలు ఈనెల 20 నుంచి ప్రారంభంకానున్నట్లు ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రీ తెలిపారు. బుధవారం దర్గా సమీపంలో మసీదులో ఉర్సు పోస్టర్లను ఆవిష్కరించారు. 20న జలాభిషేకం, 21న గంధోత్సవం, 22న దీపారాధన, 23న ఫాతేహా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 21న హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మిక వేత్తలు హజ్రత్ అజీజుల్లాఖాద్రీ, అహ్మద్‌నక్షబందితో పాటు కర్నూల్‌కు చెందిన పీర్ మహ్మద్ హుస్సేనీ, గుల్బర్గాకు చెందిన హజ్రత్ హియతుల్లా ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని, భక్తులు పాల్గొనాలని కోరారు. మతపెద్దలు మౌలానా మొహిసిన్ పాషఖాద్రీ, మౌలానా ఖాజాఫైజోద్దీన్, ఉస్మాన్‌ఖాద్రీ, జహంగీర్‌పాషఖాద్రీ, అన్వర్‌పాష, వారిస్‌పాషఖాద్రీ, అన్వర్‌పాష, నవాబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచులను అభినందించిన ఎమ్మెల్యే జీఎంఆర్



ఏకగ్రీవ సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటి కొండ, చౌలతండా, ఏవీఆర్ కాలనీ తండా, పెద్దతండా, భట్టుపల్లి గ్రామాల సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి భూత్పూర్‌కు వచ్చిన సందర్భంగా సర్పంచ్ సభ్యులైన సుశీల, లక్ష్మమ్మ రఘుపతిరెడ్డి, తారు నాయక్, కల్పన రెడ్డి, మన్నిలను ప్రత్యేకంగా అభినందిస్తూ సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సంక్షేమ కోసం పాటు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నూతనంగా ఎన్నికైన సర్పంచులు చేయూతనిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో భాగస్వాములు కావాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యువజ కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి..

» కురుమూర్తి కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఏటవతల కురుమన్న



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కురుమన్న

చిన్నచింతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సేవ చేసేందుకే రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని కురుమూర్తి గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఏటవతల కురుమన్న తెలిపారు. బుధవారం గ్రామంలో మద్దతుదారులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచ్‌గా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్‌గా గెలిపిస్తే కురుమూర్తి మెయిన్ గేటు నుంచి బీటీ రోడ్డు, గ్రామంలో అన్ని వార్డులకు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపడుతానని తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం, పాఠశాల అభివృద్ధి, శివాజీ, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, బీసీ కమ్యూనిటీ హాల్‌తో పాటు క్రీడా మైదానం పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కురుమూర్తి రాయ ఎత్తిపోతలకు సంబంధించి తమ గ్రామం వరకు చివరి ఆయకట్టు నీరు అందేలా కృషి చేస్తానన్నారు. కుల మతాలకు అతీతంగా, పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తానన్నారు.

కోయిలకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

» సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి జి.మహేశ్వరి



కోయిలకొండలో ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి జి.మహేశ్వరి

కోయిలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కోయిలకొండ మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని కోయిలకొండ గ్రామ పంచాయతీ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి జి.మహేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మద్దతు దారులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అర్హులైన ప్రతి వ్యక్తికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామ పంచాయతీకి ఉచిత అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేస్తానని, గ్రామంలో ఆడబిడ్డ పెళ్లిలకు పుస్తె మెట్టెలకు రూ.10 వేలు, మృతి చెందితే అంత్యక్రియలకు రూ.5 వేలు అందజేస్తానన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మిస్తానని, నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఉచితంగా కోచింగ్ ఇస్తామన్నారు. అర్హులైన వారికి వృద్ధాప్య, వితంతు పింఛన్లతో పాటు చౌరస్తాతో పాటు కూడళ్ల వద్ద పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తానన్నారు. నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని బ్యాట్ గుర్తుకు ఓటు వేసి సర్పంచుగా గెలిపించాలని కోరారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

» దమగ్నాపూర్ సర్పంచ్ అభ్యర్థి టి.భారతమ్మ బాలకృష్ణారెడ్డి



దమగ్నాపూర్‌లో ప్రచారం చేస్తున్న అభ్యర్థి టి.భారతమ్మ బాలకృష్ణారెడ్డి

చిన్నచింతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కత్తెర గుర్తుకు ఓటు వేసి తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి సహకారంలో దమగ్నాపూర్ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి టి.భారతమ్మ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె తన మద్దతుదారులతో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కత్తెర గుర్తుకు ఓటేసి సర్పంచ్‌గా గెలిపిస్తే.. ఊరు పక్కనే ఎస్సీ, బీసీలకు శ్మశాన వాటిక ఏర్పాటుకు రెండెకరాల పొలం ఇస్తానన్నారు. జమ్ములమ్మ, ఊర మైసమ్మ ఆలయాలతో పాటు మసీదు పునర్నిర్మాణానికి, ఎస్సీ, ఎస్టీ కాలనీలో కొత్తగా కరెంటు స్తంభాలను వేసేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామం నుంచి చిత్తనూరుకు వరకు బీటీ రోడ్డుతో పాటు అన్ని వార్డులకు సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం, వీధి లైట్లు, దమగ్నాపూర్ గేటు వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.